క్లుప్తంగా

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా టీవీ గిరి


టీవీ గిరి

విజయనగరం రూరల్: విజయనగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్‌గా టీవీ గిరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీతంపేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం.గోపాలకృష్ణను సీతంపేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అలాగే ఇక్కడ శిక్షణాధికారిగా పనిచేసిన శ్రీనివాసరావును విశాఖ జిల్లా గాజువాక ఐటీఐకి బదిలీ చేశారు.

ఆటోస్టాండ్ ప్రారంభం

విజయనగరం ఫూల్‌బాగ్: ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక గుంకలాం జగనన్న కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోస్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బి. రమణ, ఎ. జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సన్యాసినాయుడుకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మోహనరావు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట గ్రామానికి చెందిన వలంటీర్ కెల్ల మోహనరావు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సన్యాసినాయుడుకు శుక్రవారం పింఛన్ అందజేశారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సన్యాసినాయుడు రెండు కాళ్లు దెబ్బతినడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

నేడు కన్వర్జెన్సీ సమావేశం

బొండపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం పదిన్నర గంటలకు మండల ప్రత్యేక అధికారి ఎస్‌వీకే దుర్గా ప్రసాదరావు ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వేదవతి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ఊరేగింపు

- కలశాలతో పాల్గొన్న వందలాది మంది మహిళా భక్తులు
- ఆకట్టుకున్న కోలాటం, చెక్క భజనలు
- పినతాడివాడలో ఆధ్యాత్మిక శోభ


మహిళల చెక్కభజన


హరిదాసు కీర్తనల నడుమ సీతాముల విగ్రహ ఊరేగింపు


ఆకట్టుకున్న మహిళల కోలాటం ప్రదర్శన

డెంకాడ: హరిదాసుల కీర్తనలు, భక్తుల జై శ్రీరామ్ నామ స్మరణ, మహిళల చెక్కభజన, కోలాటాల నడుమ మండలంలోని పినతాడివాడలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు కనులపండువగా శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరపూజతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. మండప పునఃపూజలు, సుందరాకాండ పారాయణ, సూర్యనమస్కారాలు, మూల మంత్ర హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. సాయంత్రం సీతారాముల విగ్రహాలతో యాగశాల నుంచి బీసీ కాలనీ, పినతాడివాడ జంక్షన్ మీదుగా గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళా భక్తులు కలశాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే మహిళల చెక్క భజన, కోలాటం ప్రదర్శనలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. కార్యక్రమాల్లో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, మాజీ సర్పంచ్‌లు పల్లె భాస్కరరావు, వాళ్లె సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్నాన ఆదియ్య, లెంక రామారావు, ఉప సర్పంచ్ రేవళ్ల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం


చంద్రంపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- చంద్రంపేట, తాళ్లపూడిపేట, ఎల్ఎన్ పురం గ్రామాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం'
- హాజరైన ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని చంద్రంపేట, తాళ్లపూడిపేట, ఎల్ ఎన్ పురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీయడంతో పాటు వైఎస్సార్ సీపీ హయాంలో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు, తదితర అన్ని వర్గాల వారికీ న్యాయం జరిగిందని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమల్లు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ కర్రోతు అప్పలకొండ, నాయకులు దంతులూరి గిరిబాబు, కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, ఈఓపీఆర్‌డీ భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

నెల్లిమర్ల రూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చంద్రంపేటలో రూ.8.40 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రహదారులు, కాలువలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు లాంటివన్నారు. గత పాలకులు రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలతోనే సరిపెట్టారని, నేడు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేసి శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో రైతు భరోసా, సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి.. ఉన్న గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్లు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ కర్రోతు అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు వాల్లే లక్ష్మి, ఎంపీడీఓ గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయునికి మధుర పదార్థాల నైవేద్యం


స్వామికి నైవేద్యంగా సమర్పించిన మధుర పదార్థాలు

విజయనగరం టౌన్: స్థానిక సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి శుక్రవారం మధుర పదార్థాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే. గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజామునుంచే పంచామృతాలతో అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. సాయంత్రం సువర్చలా సమేత పంచముఖ అభయాంజనేయస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.